అధ్యక్షులకు గడ్డు కాలమే..!

- బీఆర్‌ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే అరూరిపై అసంతృప్తి సెగలు
- కాంగ్రెస్ పార్టీలోనూ పైకి కనిపించని కలవరం
- అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణకు స్థానిక నేతలతో కుదరని సయోధ్య


అరూరి రమేష్


ఎర్రబెల్లి స్వర్ణ

సాక్షి, వరంగల్: ఏ సంఘం.. రాజకీయపార్టీ అయినా అధ్యక్ష స్థానం కోసం నాయకులు ఆరాటపడతారు. ఆ పదవి దక్కిందంటే ఎంతో ఆనందంగా ఉంటారు.. కానీ, వరంగల్ జిల్లాలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల పరిస్థితి అందుకు భిన్నంగా కన్పిస్తుంది. బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట సిట్టింగ్ ఎమ్మెల్యే అరూరి రమేష్‌కు ఈసారి టికెట్ ఇస్తే మేం సహకరించబోమంటూ కొందరు ముఖ్యనేతలు నిరసన గళం వినిపించడంతో ఆయన రాజకీయ భవిష్యత్‌పై నీలినీడలు కమ్ముకున్నాయి. పార్టీ అధ్యక్షుడి పరిస్థితి మిగిలిన అభ్యర్థుల రాజకీయ భవితవ్యాన్ని ప్రశ్నార్థకం చేస్తోంది. ఏ వైపు నుంచి ఎవరు అసంతృప్తి గళం వినిపిస్తారో నన్న టెన్షన్‌తో ఉన్నారు. ప్రతిపక్షాల నుంచి పోటీ ఉంటుందనుకుంటే ఉన్న పార్టీవారే లొల్లి చేస్తుండడంతో అధికార నేతలు అయోమయంలో పడ్డారు.

ఎర్రబెల్లి స్వర్ణకు కష్టకాలమే..

వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ వరంగల్ తూర్పు టికెట్ రావడం కష్టమేనన్న సంకేతాలు రావడంతో అయోమయ పరిస్థితిలో ఉందని పార్టీ శ్రేణులు చర్చించుకుంటున్నా యి. అయితే ఆమె పార్టీ కోసమే పనిచేస్తున్నానని, టికెట్ నాక్కావాలని ఎప్పుడూ ఎవర్నీ అడగలేదని ఆమె క్లారిటీ ఇస్తున్నా.. ప్రచారం మాత్రం ఆగడం లేదు. దీనికితోడు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో జరిగే పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నా స్వర్ణకు ఆయా ప్రాంతాల స్థానిక నేతల నుంచి సానుకూలత రాకపోవడంతో ఆమె అసహనానికి గురవుతున్నట్టుగా పార్టీలో చర్చ జరుగుతోంది. దీనికితోడు జిల్లాలోని వివిధ కమిటీల నియామకాల్లోనూ తమ మాట చెల్లుబాటు కాకపోవడంతో పార్టీపై ఆమె అలక బూనారన్న ప్రచారం ఉంది. ఇటీవల నియమించిన మహిళా కమిటీల పేర్ల విషయంలో అధ్యక్షురాలిగా తాను చెప్పిన వారికి కాకుండా ఇతరులకు చోటు కల్పించడంతో ఆమె గుర్రుగా ఉన్నారని తెలిసింది. అయితే రాహుల్‌గాంధీపై కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు చేశారని నిరసిస్తూ తమ సొంతూరు వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో మంగళవారం జరిగిన రాస్తారోకోలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలి హోదాలో ఎర్రబెల్లి స్వర్ణ పాల్గొనాల్సి ఉన్నా రాకపోవడంతో పార్టీల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎందుకంటే రాహుల్ గాంధీపై వ్యాఖ్యల ను ఖండించాల్సిన ప్రాధాన్యత ఉన్న కార్యక్రమంలో ఆమె పాల్గొనకపోవడంతో అసలు కాంగ్రెస్ పార్టీలో ఏం జరుగుతుందన్న చర్చ మొదలైంది. ఇప్పటికే వర్ధన్నపేట కేంద్రంగా ఎమ్మెల్యే అరూరి రమేష్‌పై అసంతృప్తి రగులుకుంటే.. అదే వర్ధన్నపేట కేంద్రంగా జరిగిన కాంగ్రెస్ పార్టీ ప్రాధాన్యత కార్యక్రమంలో ఎర్రబెల్లి స్వర్ణ పాల్గొనకపోవడంపై రాజకీయ వర్గాల్లో చర్చ హాట్ టాపిక్‌గా మారింది.

అరూరి విషయంలో తగ్గేదేలే..!

- మంత్రి ఎర్రబెల్లిని కలిసిన అసంతృప్తి నేతలు

సాక్షి, వరంగల్: వర్ధన్నపేట ఎమ్మెల్యే రమేష్‌పై అసంతృప్తి గళం విప్పిన ముఖ్య నేతలు తగ్గేదే లేదని ముఖ్యనేతలకు చెప్పినట్టుగా తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. పర్వతగిరిలోని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు నివాసానికి అసంతృప్త నేతలు వచ్చి మరోమారు నిరసన గళం విప్పినట్టుగా తెలిసింది. అరూరి రమేష్‌కు టికెట్ ఇస్తే ఎట్టి పరిస్థితుల్లో సహకరించబోమని తేల్చిచెప్పినట్టుగా జోరుగా చర్చ జరుగుతోంది. దీంతో అసంతృప్తి చల్లార్చేందుకు ఎర్రబెల్లి దయాకర్ రావు చేసిన ప్రయత్నం పెద్దగా ఫలించినట్టుగా లేదని పార్టీ శ్రేణులు చర్చించుకుంటున్నాయి. ఇదిలా ఉండగా హనుమకొండలోని ఎమ్మెల్యే అరూరి రమేష్ నివాసానికి ఆయా మండలాల నుంచి కొందరు పార్టీ నేతలు వచ్చి కలిశారు. దీంతో అక్కడ వాతావరణం మంగళవారం ఉదయం సందడిగా కనిపించినా.. సాయంత్రం మళ్లీ అసంతృప్తి సెగలు తాకడంతో వర్ధన్నపేట నియోజకవర్గంలో విచిత్ర పరిస్థితి నెలకొన్నట్లు స్పష్టమవుతోంది.

పీహెచ్‌డీ సీట్ల సంఖ్యను పెంచాలి


కేయూ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న విద్యార్థి సంఘాల బాధ్యులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో వివిధ విభాగాల్లో పీహెచ్‌డీ రెండో కేటగిరి సీట్లను పెంపుదల చేసి ఆ తర్వాతనే ఇంటర్వ్యూలు నిర్వహించాలని ప్రగతిశీల ప్రజాస్వామిక విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ), మాదిగ విద్యార్థి ఫెడరేషన్ (ఎంఎస్‌ఎఫ్) విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం కేయూ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావుకు వినతిపత్రం సమర్పించారు. ఎంఎస్‌ఎఫ్ జిల్లా ఇన్‌చార్జ్ మంద భాస్కర్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి నర్సింహారావు మాట్లాడుతూ పీహెచ్‌డీ రెండో కేటగిరీ సీట్ల సంఖ్యను పెంచాలని, అప్పటి వరకు ఈనెల 20 నుంచి జరుగబోయే ఇంటర్వ్యూలను వాయిదా వేయాలని కోరారు. అడ్జెంట్ ప్రొఫెసర్లకు, సీనియర్ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు కూడా గైడ్ షిప్ ఇచ్చి వివిధ విభాగాల్లో పీహెచ్‌డీ సీట్ల సంఖ్యను పెంచాలన్నారు. రిజిస్ట్రార్‌ను కలిసిన వారిలో ఆయావిద్యార్థి సంఘాల బాధ్యులు అభిరామ్, రమేష్, కె శ్రీనివాస్, సురేష్, ఉపేందర్, సాల్మన్, సికిందర్, మహేష్, రమేష్, ప్రవీణ్, శివ ఉన్నారు.

ఏసీపీ శ్రీనివాస్‌కు ఆత్మీయ వీడ్కోలు


మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్

వరంగల్ క్రైం : కాజీపేట ఏసీపీగా పనిచేసి హైదరాబాద్ మాదాపూర్ ఏసీపీగా బదిలీపై వెళ్లిన పి.శ్రీనివాస్ కాజీపేట సబ్ డివిజన్ పోలీసులు సోమవారం రాత్రి ఆత్మీయ వీడ్కోలు పలికారు. హనుమకొండలో జరిగిన వీడ్కోలు సమావేశంలో సెంట్రల్ జోన్ డీసీపీ బారీ మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాల మన్ననలతో పాటు ఉన్నతాధికారుల మన్ననలు పొందిన వ్యక్తి శ్రీనివాస్ అని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ తనతో పనిచేసిన అధికారుల పూర్తి సహకారం వల్ల తాను ఉద్యోగంలో అందరి మన్ననలు పొందినట్లు తెలిపారు. ఎక్కడ సర్వీస్ చేసిన పోలీస్ శాఖకు పేరు తీసుకురావడానికే పూర్తిస్థాయిలో పనిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో శిక్షణ ఐపీఎస్ అధికారి అంకిత్, ఏఆర్ అదనపు డీసీపీ సంజీవ్, ఏసీపీలు కిరణ్, బోనాల కిషన్, దేవేందర్‌రెడ్డి, తిరుమల్, డేవిడ్‌రాజ్, సతీష్‌బాబు, సీఐలు కిషన్, షుకూర్, ప్రవీణ్, రాజు, సంజీవ్, ఆదర్శ లా కళా శాల చైర్మన్ బూర విద్యాసాగర్, ప్రెస్‌క్లబ్ అ ధ్యక్ష, కార్యదర్శులు వేముల నాగరాజు, బొల్లారపు సద య్య, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, కార్పొరేటర్లు, పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో నాలాలను పరిశీలించిన మేయర్


నాలాను పరిశీలిస్తున్న మేయర్ సుధారాణి

రామన్నపేట : వర్షాలు విస్తృతంగా కురుస్తున్న నేపథ్యంలో నాలాల స్థితిగతులను తెలుసుకోవడానికి మేయర్ గుండు సుధారాణి మంగళవారం పలు డివిజన్లలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా 11వ డివిజన్‌లోని పోతననగర్ నాలాతో పాటు 22వ డివిజన్ కొత్తవాడ ప్రాంతంలోని ఉప్పరోనిగడ్డ ప్రాంతంలో పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వర్షాలు భారీగా కురిసే అవకాశం ఉన్న ప్రస్తుత తరుణంలో నాలాల్లో నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నందున ఎప్పటికప్పుడు డిసిల్టింగ్ ప్రక్రియను చేపట్టాలన్నారు. ఆమె వెంట కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామి, సీఎంహెచ్‌ఓ రాజేశ్, ఈఈ రాజయ్య, డిఈ రవికుమార్, ఏఈ రాగి శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

మీకు మేం అండగా ఉంటాం

- ఎమ్మెల్యే అరూరికి ధైర్యం చెప్పిన కార్యకర్తలు


ఎమ్మెల్యేకు ధైర్యం చెబుతున్న నాయకులు

హసన్‌పర్తి: అన్నా మేం మీకు అండగా ఉన్నాం. మేం మిమ్మల్ని గెలిపిస్తామని మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్‌కు ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యేకు టిక్కెట్ ఇ వ్వొద్దని నియోజకవర్గంలోని పలువురు నాయకులు ఇటీవల మంత్రి దయాకర్‌రావు, ప్రణాళిక సంఘం ఉ పాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. దీంతో పలు గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు హనుమకొండలోని ఎమ్మెల్యే ఇంటికి వెళ్లి అండగా ఉంటా మని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతపాక సునీత, జెడ్పీటీసీ రేనుకుంట్ల సునీత, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు వీసం సురేందర్‌రెడ్డి, చకిల రాజేశ్వర్‌రావు, పిట్టల కుమారస్వామి, గొ రిశెట్టి కృష్ణమూర్తి, నాయకులు రాజేందర్, రవీందర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

దళిత ఎమ్మెల్యేపై వివక్షణా?

దళిత ఎమ్మెల్యేపై అగ్రవర్గాల నాయకులు వివక్షత చూపుతున్నారని ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు పుట్ట రవిమాదిగ, చుంచు రాజేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తున్న అరూరిపై అగ్రవర్గాల నాయకులు ఏకమై పెత్తందారుల ముసుగులో నిందారోపణలు చేయడం సరికాదన్నారు. పవన్, రవీందర్, జనార్దన్, సుధాకర్, రమా, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

వర్షంలో రైల్వేట్రాక్ కీమెన్ పెట్రోలింగ్

కాజీపేట రూరల్ : రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో రైల్వే అధికారులు అప్రమత్తమయ్యారు. కాజీపేట జంక్షన్ పరిధిలోని ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన కీమెన్లు ట్రాక్‌మెన్ల విధులను మరింత అప్రమత్తం చేశారు. దీంతో మంగళవారం ట్రాక్‌మెన్లు, వర్షకాలంలో కీమెన్లు, ట్రాక్‌మెన్లు ట్రాక్ పెట్రోలింగ్ విధుల్లో భాగంగా వర్షంలో తడవకుండా రెయిన్‌కోటు దుస్తులు ధరించి, చేతులలో పనిముట్లు, వీపుకు పనిముట్ల బ్యాగ్ ధరించి రైలు పట్టాల వెల్డింగ్‌ను, బోల్టులు, తదితర టెక్నికల్ పరికరాలను పరిశీలించారు. కీ మెన్లు విధి నిర్వహణలో వారి ఉపయోగించే పనిముట్లను తమ వెంట పెట్టుకొని 3 కిలోమీటర్ల దూరం వరకు అప్ అండ్ డౌన్ మార్గంలో నడిచి విధులు నిర్వహిస్తున్నారు.


గుణాత్మక విద్య కోసమే తొలిమెట్టు

- డీఈఓ ఎండీ అబ్దుల్‌హై


మాట్లాడుతున్న డీఈఓ ఎండీ.అబ్దుల్‌హై

విద్యారణ్యపురి : జిల్లాస్థాయిలో ఈనెల 21, 22, 24 తేదీల్లో హనుమకొండలో నిర్వహించనున్న డీ ఆర్పీల శిక్షణ, ఆ తర్వాత నిర్వహించనున్న ఉపాధ్యాయుల శిక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని హనుమకొండ డీఈఓ ఎండీ అబ్దుల్‌హై కోరారు. డీఈఓ కార్యాలయంలోని డీసీఈబీ భవనంలో మంగళవారం నిర్వహించిన ఎఫ్‌ఎల్‌ఎన్‌నోడల్ అధికారులు, ఎంఈఓలు, రిసోర్స్ పర్సన్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు గుణాత్మక విద్య లక్ష్యంగా తొలిమెట్టును అమలు చేయాలన్నారు. ఈ విద్యాసంవత్సరం కూడా కొనసాగిస్తూ విజయవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎంపిక చేసిన రిసోర్స్ టీచర్లు అందరూ కూడా తామ సబ్జెక్టులకు సంబంధించి కూడా పాఠ్యపుస్తకాలను తీసుకొని శిక్షణకు రావాలన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు కనీసం ఒక సబ్జెక్టులో, గరిష్టంగా రెండు సబ్జెక్టుల్లో శిక్షణ తీసుకునే విధంగా ఉపాధ్యాయులను గుర్తించాలని మండల నోడల్ అధికారులను కోరారు. జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్, కమ్యూనిటీ మొబిలైజింగ్ కోఆర్డినేటర్ బి.రాధ, జీసీడీఈఓ సునీత, ప్లానింగ్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, ఎంఈఓలు రాంకిషన్‌రాజు, వెంకటేశ్వర్‌రావు, రమాదేవి, రవీందర్, ధర్మసాగర్ మండల నోడల్ అధికారి బి.రాంధన్ పాల్గొన్నారు.

సంకల్పయాత్రకు తరలిరావాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉద్యోగ సంఘాల నేతలు

హసన్‌పర్తి : ఈనెల 21న వెంకట్రామ థియేటర్ నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించే పెన్షన్ సాధన సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని కోరుతూ పోస్టర్‌ను ఆవిష్కరించారు. చింతగట్టు క్యాంప్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో సీపీఎఫ్‌జిల్లా అధ్యక్షుడు కందుల జీవన్‌కుమార్ మాట్లాడుతూ కాంట్రిబ్యూషన్ పెన్షన్ స్కీం విధానాన్ని అమలు చేయాలని కోరుతూ ఈనెల 16 నుంచి పాత పెన్షన్ సంకల్ప యాత్ర ప్రారంభమైందన్నారు. 21న ఈ యాత్ర వరంగల్‌కు చేరుకుంటుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు డాక్టర్ వెంకటస్వామి, మరుగు శేషగిరి, నరసమ్మ, దివాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ముస్తపా హుస్సేన్, నాయకులు శ్రీనివాస్, రాజమౌళి, రాజు, అబ్దుల్ హమీద్, శైలజా, అక్బర్, కుమార్, ఉప్పలయ్య, రాజమల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బహుజన విద్యార్థి గర్జనను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

హన్మకొండ : హనుమకొండలో ఈనెల 20న జరిగే బహుజన విద్యార్థి గర్జనను విజయవంతం చేయాలని బీఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొట్ల కార్తీక్, వరంగల్ రీజనల్ సెక్రటరీ కన్నం సునీల్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద బహుజన విద్యార్థి గర్జన కరపత్రాలను విడుదల చేశారన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురువారం ఉదయం 10 గంటలకు హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్‌లో బహుజన విద్యార్థి గర్జన మహాసభ జరుగుతుందని వివరించారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. సభకు అన్ని వర్గాల ప్రజలు భారీ తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు శనిగరపు రాజు, మంద శ్యామ్, నాయకులు తాళ్లపెల్లి వెంకటస్వామి, జన్ను భరత్, దరిగి ధనరాజ్, కిరణ్, రామంచ శ్రీను, కందుకూరి యువకిషోర్, వేల్పుల శంకర్, మామిండ్ల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆపద మహిళలు 181 టోల్‌ఫ్రీకి డయల్ చేయండి

హసన్‌పర్తి : ఆపదలో ఉన్న మహిళలు 181 టోల్ ఫ్రీకి డయల్ చేయాలని కేస్ వర్కర్ హరిత తెలి పారు. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళా అభివృద్ధి శిశు సంక్షేమశాఖ, సఖి వన్‌స్టాప్ కేంద్రం హనుమకొండ ఆధ్వర్యంలో హసన్‌పర్తి మండలం చింతగట్టులో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం సమావేశంలో హరిత మాట్లాడుతూ వరకట్న, లైంగిక వేధింపులు, అకారణంగా గర్భవిచ్ఛినం, మహిళలు, బాలికలకు రక్షణ కల్పించడం పోలీస్, వైద్యసాయం, ఉచిత కౌన్సెలింగ్, తాత్కాలిక వసతి వంటివి సఖి కేంద్రం ద్వారా అందిస్తారని తెలిపారు. ఫోన్ నంబర్ 0870–2452112 డయల్ చేయాలని సూచించారు.కార్యక్రమంలో కరుణ,అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పాఠశాలను సీజ్ చేయాలి




హసన్‌పర్తి : భీమారం శివారులో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న స్కై పాఠశాలను సీజ్ చేయాలని యూఎస్‌ఎఫ్‌ఐ డిమాండ్ చేసింది. మంగళవారం యూఎస్‌ఎఫ్‌ఐ సభ్యులు మండల విద్యాశాఖ అధికారి రామకృష్ణరాజుకు వినతిపత్రం అందజేశారు. యూఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మాలోతు రాజేశ్‌నాయక్ మాట్లాడుతూ స్కై పాఠశాల పేరిట అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతోందన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



హసన్‌పర్తి: గ్రామపంచాయతీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న న్యాయమైన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ ఆ సంఘం నేతలు మంగళవారం హనుమకొండలోని వర్ధన్నపేట ఎమ్మెల్యే స్వగృహంలో అరూరి రమేశ్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామపంచాయతీ ఉద్యోగుల సమ్మెలో భాగంగా 13వ రోజు ఈ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో తెలంగాణ గ్రామపంచాయతీ కారొబార్, బిల్ కలెక్టర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చాతల్ల సదానందం, జిల్లా ఇన్‌చార్జ్ తగరం శివ, మడల అధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి కుక్కమూడి నరేష్, ఉపాధ్యక్షులు కుమార్, పాల్గొన్నారు.

పరపతి సంఘం అధ్యక్షుడికి నివాళి



కాశిబుగ్గ : గ్రేటర్ వరంగల్ 19వ డివిజన్ యువజ్యోతికాలనీ విఘ్నేశ్వర, పద్మశాలి పరపతి సంఘం అధ్యక్షుడు బిజ్జ ఆంజనేయులు మంగళవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, మాజీ కార్పొరేటర్ ఓని భాస్కర్ ఆంజనేయలు నివాసానికి వెళ్లి అయన మృతదేహన్ని సందర్శించి నివాళులర్పించారు. వారి వెంట బీఆర్‌ఎస్ నాయకులు వేముల నాగరాజు, గోరంటల మనోహర్, మోతీలాల్‌నాయక్, క్యాతం రంజిత్, సిలువేరు పవన్ ఉన్నారు.

ఫొటోగ్రఫీలో మార్పులను గుర్తించాలి



కాజీపేట: రోజుకో ఫొటోగ్రఫీలో మారుతున్న సాంకేతిక అంశాలను గుర్తు చేసుకుంటేనే వృత్తిలో రాణించగలుగుతారని సంఘం అధ్యక్షుడు తూర్పాటి జగదీశ్వర్ అన్నారు. పట్టణంలో ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ విస్తృతస్థాయి సమావేశాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సభ్యులనుద్దేశించి మాట్లాడారు. సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షుడు బొమ్మల అశోక్ కుమార్, ప్రధాన కార్యదర్శి మంతెన మోహన్, కోశాధికారి పల్లి క్రిష్టఫర్, రామకృష్ణ, బస్కె నాగరాజు, సంపత్, కిశోర్, సాంబశివ తదితరులు పాల్గొన్నారు.

బాలాజీనగర్ సొసైటీ నూతన కమిటీ ఎన్నిక

కాజీపేట రూరల్ : కాజీపేట 47వ డివిజన్ బాలాజీనగర్‌ని పోచమ్మ ఆలయ ప్రాంగణంలో మంగళవారం బాలాజీనగర్ సొసైటీ ఎన్నికలు జరిగాయి. మొత్తం 75 కుటుంబాలు పాల్గొని కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్నికల పర్యవేక్షకులుగా ఎం.కృష్ణమూర్తి, ప్రదీప్‌కుమార్, సహాయకులుగా పి.రాజేందర్‌ప్రసాద్, విజయ్‌ల సమక్షంలో ఎన్నికలు జరిగాయి. అధ్యక్షుడుగా ఎ.మల్లారెడ్డి, కార్యదర్శిగా తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, కోశాధికారిగా జోలి చంద్రమౌళి ఎన్నికయ్యారు.

కేయూలో కాంట్రాక్టు లెక్చరర్ల ధర్నా

కేయూ క్యాంపస్: తెలంగాణ రాష్ట్రంలోని యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్ (కుక్టా) ఆధ్వర్యంలో డిమాండ్ చేస్తూ మంగళవారం క్యాంపస్‌లోని పరిపాలనా భవనం వద్ద కాంట్రాక్టు లెక్చరర్లు ధర్నా చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ జేఏసీ చైర్మన్ డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్, కో చైర్మన్ జరుపుల చందులాల్, కేయూ జనరల్ సెక్రటరీ ఆర్‌డి ప్రసాద్, బాధ్యులు నాగయ్య, సంగీత్‌కుమార్ పాల్గొన్నారు.

గుంతలో పడిన కారు



దేశాయిపేట : వరంగల్ దేశాయిపేట ప్రధాన రహదారి ఓ ప్రైవేట్ స్కూల్ ఎదుట పైప్‌లైన్ లీకేజీతో ఏర్పడిన ఓ గుంతలో మంగళవారం కారు దిగపడిపోయింది. దీంతో కారులో ఉన్న వారు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. వెంటనే స్థానికులు స్పందించి కారును అ గుంతలో నుండి బయటకు తీశారు. గత కొన్ని రోజులుగా ప్రధాన పైప్‌లైన్ లీకేజీతో రోడ్డుపై పెద్ద గుంత ఏర్పడిందన్నారు. అందులో నుంచి పెద్ద ఎత్తున నీళ్ల లీకేజీ అయి వరదలా రోడ్డుపై ప్రవహిస్తున్నాయని, అయినా సంబంధిత అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. గుంతలో పలు వాహనాలు పడి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ఒక వాహనదారుడు ఇదే గుంతలో పడి మృతి చెందాడన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి లీకేజీలు అరికట్టి అ గుంతను వెంటనే పూడ్చి వేయాలని వారు కోరుతున్నారు.

కరుణించిన వరుణ దేవుడు

కాజీపేట: వరుణ దేవుడు కరుణించడంతో సోమవారం రాత్రి నుంచి పట్టణంలో ఓ మోస్తరులో వర్షాలు కురుస్తున్నాయి. వర్షాకాలం ఆరంభమై దాదాపు నెలన్నర కావస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో వర్షం కురిసింది లేదు. వర్షాలు పడాలని ఆకాంక్షిస్తూ దేవాలయాల్లో వరుణ యా గాలు, కప్పతల్లి ఆటలు, మహిళల వేడుకోలు పా టలతో హోరెత్తాయి. ఎట్టకేలకు కురిసిన వర్షాలతో రైతులు, ప్రజలు ఆనందంలో మునిగిపోయారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

కాశిబుగ్గ/కరీమాబాద్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవని 35, 40వ డివిజన్ కార్పొరేటర్లు సోమిశెట్టి ప్రవీణ్, మరుపల్ల రవిఅన్నారు. మంగళవారం ఆయా డివిజన్లలో డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పారిశుద్ధ్య, ఆరోగ్య శాఖ, అంగన్‌వాడీ అధికారులతో కలిసి ఇంటింటికి తిరిగి పరిసరాలలో నీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మైసయ్యనగర్‌లో ఇంటింటికి తిరుగుతూ ఇళ్ల చుట్టూ చెత్తాచెదారం లేకుండా చూసుకోవాలని సూచించారు. ఇండ్లలో ఉన్న డ్రమ్ములో, కొబ్బరిబొండాల్లో చేరిన నీటిని పారబోయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు. వారి వెంట హెల్త్ అసిస్టెంట్ శ్యామ్, శివాకుమార్, జవాన్లు సతీష్,ప్రశాంత్, అంగన్‌వాడీ టీచర్లు, ఏ ఎన్‌ం, ఆశ కార్యకర్తలు, ఆర్పీలు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

క్లుప్తంగా

వరంగల్‌కు ఏసీఎస్‌ఓల నియామకం

కరీమాబాద్: వరంగల్ అసిస్టెంట్ సివిల్ సప్లయ్ అధికారులుగా సిహెచ్.శివప్రసాద్‌రెడ్డి , సయ్యద్ ఫైజల్ హుస్సేనీ నియమితులయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా పౌర సరఫరాల శాఖలో మంగళవారం బదిలీలు జరిగాయి. బదిలీల్లో భాగంగా వరంగల్‌లో పనిచేసిన కె.వనజ సంగారెడ్డి జిల్లాకు బదిలీ కాగా అక్కడ పనిచేస్తున్న శివప్రసాద్‌రెడ్డి, నాగర్‌కర్నూల్‌లో పని చేస్తున్న సయ్యద్ ఫైజల్ హుస్సేనీ వరంగల్ ఏసీఎస్‌ఓలుగా బదిలీ అయ్యారు.

కేయూ సీఐగా అబ్బయ్య



వరంగల్ క్రైం : కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా ఎం.అబ్బయ్యను నియమిస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గత రెండు నెలలుగా ఎస్‌హెచ్‌ఓ పోస్టు ఖాళీగా ఉండడంతో సీపీ ఖమ్మం నుంచి వరంగల్ కమిషనరేట్‌కు వచ్చిన అబ్బయ్యను కేయూ సీఐగా నియమించారు. గతంలో ఇక్కడ పనిచేసిన పత్తిపాక దయాకర్ ఓ భూమి వివాదాంలో అవినీతికి పాల్పడడంతో దయాకర్‌పై సీపీ సస్పెన్షన్ వేటు వేశారు.

రెయిన్‌కోట్‌ల పంపిణీ

హసన్‌పర్తి : నగరంలోని 1వ డివిజన్ ముచ్చర్లలో విధులు నిర్వహించిన పారిశుద్ధ్య కార్మికులకు మంగళవారం రెయిన్ కోట్‌లు పంపిణీ చేశారు. స్థానికుడు చల్లా మోహన్‌రెడ్డి భార్య పూలమ్మ జ్ఞాపకార్థం ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు చల్లా కుమార్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, స్థానికులు శ్రీధర్, పాల్, చిర్ర రాజేష్, శ్రవణ్, సతీష్‌చారి, రమేష్, బాబు, సాంబయ్య పాల్గొన్నారు.

శ్రావణమాసం ఉత్సవాలు

కాజీపేట: 63వ డివిజన్ జూబ్లీ మార్కెట్ ఆవరణలో కొలువుదీరిన శ్రీభ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవాలయంలో మంగళవారం నుంచి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. సాయంత్రం శ్రావణమాసం పూజల ఆహ్వాన పత్రికలను భక్తులు ఆవిష్కరించారు. ఆలయ పాలక మండలి సభ్యులతో కలిసి ప్రధాన అర్చకులు అయినవోలు ప్రవీణ్‌కుమార్ ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించి పంపిణీ చేశారు.

శ్రీలలితాదేవికి లక్ష పుష్పార్చన పూజ

ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లోని సీతారామచంద్రస్వామి ఆలయంలో శ్రీలలితాదేవి అమ్మవారికి లక్ష పుష్పార్చన పూజ శాస్త్రోక్తంగా నిర్వహించారు. అధిక శ్రావణం ప్రారంభం.. పాడ్యమి సందర్భంగా మంగళవారం ఆలయ ప్రధాన పూజారి వెంకటేశ్వర చారి ఆధ్వర్యంలో అమ్మవారికి లక్ష పుష్పార్చన పూజను నేత్రపర్వంగా నిర్వహించారు. భక్తి శ్రద్ధలతో భక్తులు పెద్ద ఎత్తున చేరుకుని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.కార్యక్రమంలో శ్రీరాంరాజేష్, అడెపు శ్యాంసుందర్, రావికంటి ఆశోక్, యాదిగిరి,మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

దాతలు ముందుకు రావాలి

హసన్‌పర్తి : పాఠశాలల బతోపేతానికి దాతలు ముందుకు రావాలని రోటరీ క్లబ్ అధ్యక్షుడు రవీంద్రనాథ్ అన్నారు. మండలంలోని జయగిరి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు సుమారు రూ.25 వేలు విలువ గల 500 నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. హన్మకొండ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం రోటరియన్ మహిపాల్‌రెడ్డి సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి గంగోజుల నరేష్, రీజినల్ సెక్రటరీలు సతీష్‌కుమార్, అంచూరి విజయ్, మన బడి -మన బాధ్యత నియోజవర్గ కో-ఆర్డినేటర్ దోమ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నకిలీ డాక్యుమెంట్లు సృష్టించిన వ్యక్తి అరెస్ట్

వరంగల్ క్రైం : హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేఎస్‌ఆర్ గార్డెన్ వద్ద ఎక్సైజ్ కాలనీకి చెందిన రిటైర్డ్ ఉద్యోగి చంద్రమౌళి భూమికి సంబంధించిన నకిలీ డాక్యుమెంట్లు సృష్టించిన జంగ్లీ ప్రభాకర్‌ను అరెస్ట చేసి రిమాండ్‌కు తరలించినట్లు హనుమకొండ ఇన్‌స్పెక్టర్ ఎస్.కరుణాకర్ తెలిపారు. దీంతో పా టు మరికొందరి భూములకు సంబంధించిన నకిలీ డాక్యుమెంట్లను తయారు చేసి ప్రభాకర్ విక్రయించినట్లు ఆయన తెలిపారు. చంద్రమౌళిపై బెదిరింపులకు పాల్పడిన సంఘటనలో ఆయన ఫిర్యాదు మేరకు ప్రభాకర్‌పై కేసు న మోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

సెంట్రింగ్ ఐరన్ ప్లేట్ల చోరీ

ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లోని రుద్రమాంబనగర్ కాలనీలో శ్రీనివాస్ ఇంటి నిర్మాణంలో స్లాబ్ కోసం ఉపయోగించే సెంట్రింగ్ ఐరన్ ప్లేట్లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. బాధితుడి కథనం ప్రకారం. చింతల్ ఆర్‌ఎస్‌నగర్‌కు చెందిన మద్ది సంపత్ తాపీమేస్త్రీగా పనిచేస్తున్నాడు. ఆయన రుద్రమాంబ నగర్ కాలనీలో భవన నిర్మాణం పనులు చేస్తున్నాడు. ఈనెల 8న అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిర్మాణ స్థలంలో రూ.31వేల విలువైన 24 సెంట్రింగ్ ఐరన్ ప్లేట్లను చోరీ చేశారు. ఈనెల 9న ఉదయం సంపత్ పనికోసం అక్కడికి రాగా ప్లేట్లు కనిపించలేదు. బాధితుడు ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.